# కేబుల్ కనెక్షన్...

— యమ్. వీరేశ్వరరావు

ఆరోజు ఆదివారం. నేను ఇంకా నిద్రనుండి లేవలేదు. నేను లేవకుండానే ఒక పొలికేక వినబడింది హాలునుండి. అది మా పుత్రరత్నంది.. "విధి వంచితా.. కలకూజితా.. అంతరంగాలు.. మానసవీణ.. టింగ్‌టింగ్" అంటూ!

ఏమిటీ కల్లోలం? అని ఆలోచనలో పడిన నాకు అర్ధమయ్యింది. టీవీ ఛానల్స్ చూడడంవలన బాబిగాడికి వచ్చిన పైత్యపు ప్రేలాపన అని. నా భార్యని పిలిచాను. ఆవిడ కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యి "చూసారా! ప్రైవేట్ ఛానల్స్ పుణ్యమా అని మంచి తెలుగు వస్తోంది!" అంటూ ఒక లాభం చూపించింది.

"అంటే కాన్వెంట్‌కన్నా టీవీయే నయమని నీ ఉద్దేశమా?"

"అయినా మీరేగా తెలుగు మీడియం అయితే వాడికి మంచి ఉద్యోగాలు రావని లిటిల్ ఏంజల్స్‌లో డొనేషన్ కట్టి చేర్పించింది."

అదీ నిజమే! అసలు ఈ ఛానల్స్‌లో ఏలాంటి కార్యక్రమాలు వస్తున్నాయో, అవి ఎంతవరకూ వినోదాన్ని ఇస్తున్నాయో... వాటి అవసరం ఉందా లేదా అని తేల్చుకుందామని టీవీ ముందు కూర్చున్నాను.

• • •

ఫలానా ఛానల్!

ఒక యాంకర్ భయంకరంగా పళ్ళన్నీ బయటపెట్టి ఇలా చెప్పడం ప్రారంభించింది.

"మా ప్రేక్షకులకు సువర్ణావకాశం. ఒకరోజులో మీకు వచ్చిన పిచ్చి ఆలోచనలు కాగితంమీద వ్రాసి మాకు పంపండి. అందులో నుండి ఉత్తమ చెత్త పిచ్చి ఆలోచన వ్రాసిన ఒక వ్యక్తిని 'డ్రా' నుండి తీసి అతనికి దేహశుద్ధి చేసి మాఖర్చులతో వైజాగ్ పంపిస్తాము. మా చిరునామా.."

• • •

ఆ దెబ్బతో రారుకొని ఛానల్ మార్చాను.

అప్పటికే పదిసార్లు వచ్చి నలిగిపోయిన పాత రూపాయి నోటులాంటి సినిమా వస్తోంది.

రాత్రి 9 గం.

నా భార్య సీరియస్‌గా ఏదో వ్రాస్తోంది. తండ్రికి ఉత్తరం వ్రాస్తోందనుకున్నాను. పోనీ ఎం.ఏ.కి నోట్స్ ప్రిపేర్ చేస్తోందనుకున్నా. ఏదైన కథో లేక కవిత వ్రాసి సాహితీసేవకి ఉపక్రమించిందా అంటే అదీ కాదు.

ఆవిడ వ్రాస్తున్నది ఏమిటంటే...

ఏ ఛానల్లో ఏ సీరియల్ వస్తోంది? ఏ సమయంలో వస్తోంది? ఏ రోజు? ఏ ఎపిసోడ్ ఏ స్థితిలో ఉంది! ఏ పోటీల్లో పాల్గొనాలి? ఇలాంటి వివరాలతో కూడిన 'రెడీరెకనర్' తయారు చేస్తోంది.


"ఈశ్రద్ధ వంటమీద ఉంటే ఎంత బాగుండును" అన్నాను నేను.

"చాల్లెండి బడాయి

"'అతని అనుభవం' సీరియల్ ఎప్పుడు వస్తోందో చూడాలి" అంటూ ఆలోచనలో పడింది నన్ను, పరిసరాల్ని మర్చిపోయి.

• • •

కేబుల్ కనెక్షన్ వచ్చినప్పటి నుండి రాత్రి 12 గంటల వరకూ టీవి దగ్గర కూర్చోవడం, బాబిగాడి చదువు 'కుంటెనడక' స్థితి నుండి 'కదలని రాయి' స్థితికి రావడం, వండిన పదార్థాలలో ఉప్పు, కరివేపాకు లాంటి వస్తువులు మాయమవ్వడం జరుగుతోంది! ఇల్లు అడవిలా తయారయ్యింది.




• • •

మరుసటి ఆదివారం

ఒక ఛానల్లో రామారావు 'చెల్లియో, చెల్లకో' అని పాడుతుంటే నేను నా భార్యను అడిగాను, "వంటింట్లో గ్యాస్ మీద ఏమైనా ఉందా?" అని.

నా భార్య వంటింట్లోకి వెళ్ళే సమయానికే మార్జాలరావు గారు పాలు ఆరగించారు.

బయటికిపోయి ఇరానీచాయ్ త్రాగి వచ్చాను. సమయం మధ్యాహ్నం 12 గంటలు. నా భార్య 'అతని అనుభవం' సీరియల్ ఎపిసోడ్ సీరియస్‌గా చూస్తోంది. అప్పటికే వంటింట్లోకి చొరబడి అన్ని పదార్థాలు తిని, తృప్తిగా త్రేన్చి నాలుక తుడుచుకుంటున్న 'భైరవరావు' గారు నాకు ఎధురయ్యారు. దాంతో 'కుక్క' వలన తిక్కరేగిన నేను చెడమడా తిట్టాను. ఆమె అలిగి రాత్రి వంట చెయ్యలేదు. మేరేజ్‌డేకి గోల్డ్‌రింగ్ ప్రామిస్ చేసాక వంట చేసింది.

• • •

సమయం రాత్రి పదకొండు.

మల్లెల పరిమళం చల్లగా బయట నుండి వస్తోంది. ఆ సమయంలో ఆమె వంటిమీద చెయ్యివేస్తే, "మీరు పడుకోండి స్టార్‌ప్లస్‌లో సినిమా చూడాలి" అని జవాబు ఇచ్చింది.

• • •

మరుసటి ఆదివారం

నేను హాలులో కూర్చుని పేపర్ చదువుతుంటే 'డాడీ అంత్యాక్షరి ఆడుకుందామా?' అని అడిగాడు పుత్రరత్నం. దానితో నాకు కోపం వచ్చి వాడికి అష్టోత్తరం, సహస్ర నామార్చన వినిపించాను. కాన్వెంట్ కుర్రాడు కదా అంతా అర్ధం కాకపోయినా వాడి నాన్న తిడుతున్నాడని అర్ధమయ్యింది. ఈలోగా నా భార్య ఆందోళగా వచ్చింది.

విషయం ఏమిటంటే టీవీలో చుక్కలు వస్తున్నాయిట. 'బాగా అయ్యింది' అని లోపల అనుకొని పైకి "నీ చీరల డిజైన్ చూసుకో" అన్నాను.

నామీద దండయాత్ర ప్రారంభించారు. ఇంతిపోరు ఇంటిపోరు పడలేక బాగుచేయించాను. అధికార పార్టీలో అసంతృప్తి పోనట్టు ఇంట్లో అసంతృప్తి పోలేదు. కారణం కేబుల్ కనెక్షన్ కంట్రోల్‌రూమ్‌లో ఏవో సమస్యలుట. రెండు మూడు ఛానల్స్ కలిసి వస్తున్నాయిట. 'దీనినే అంటారు- కాగల కార్యం గంధర్వులే తీర్చారని.'

'సామెతలు నాకూ తెలుసు. కేబుల్ వాడిదగ్గరకు వెళ్ళండి" అంది మా ఆవిడ.

• • •

కేబుల్ కనెక్షన్ వాడిదగ్గరికి వెళ్ళి శాశ్వత పరిష్కారం చేసాను. మరునాడే వైరు పట్టుకుపోయాడు. ఇప్పుడు ఇల్లు ప్రశాంతంగా ఉంది. బాబిగాడు తెలుగు నేర్చుకుంటున్నాడు. నా భార్య ఎం.ఏ.కి కట్టింది. ప్రస్తుతం టీవి దగ్గరకు ఎవరూ వెళ్ళడంలేదు హైదరాబాద్ కార్యక్రమాలు వస్తున్నాయికాబట్టి. నా భార్య వంటలో మార్పు వచ్చింది.

★